# అంబాలీస్

హరిజన హాస్టల్‌కూ నరసయ్య పవుల్ట్రీకు కంచె అడ్డం. పవుల్ట్రీ లోపలికి వెళ్లాలంటే మామిడితోట దాటి చుట్టూ తిరిగి వెళ్లాలి. తడిక గేటు కర్ర విరిగి పక్కకు ఒరిగి ఉంది. లోపలకు నడిచాను. కోళ్లగోల. చెట్టుకింద నీళ్లు నిలిచి మురుగువాసన వేస్తోంది. నరసయ్య ఇంట్లో ఉన్నాడో లేడో తెలియదు. అరుగుమీదున్న మడత కుర్చీలో ఒకామె కూర్చుని ఉంది. ఆమె ఎర్రగా నల్లంచు తెల్ల చీరలో శుభ్రంగా ఉంది. మడత కుర్చీ పక్కనే ఉన్న బల్లకు అటు చివర మరోఆమె కూర్చుని ఉంది. ఈమె చామన చాయలో ఉంది. ఉంగరాలు తిరిగిన జుట్టు పొట్టిగా ముందుకు వచ్చి ఉంది. కళ్లు గుండ్రంగా ఉన్నాయి. ఇద్దరి వయస్సూ ముప్ఫయి సంవత్సరాల లోపు ఉంటాయి.

అరుగు ఎక్కి, "నా పేరు రంగారావు. ఈ ఊరి హైస్కూల్లో సైన్సు టీచరుగా పనిచేస్తున్నాను" అన్నాను. అని, ఇద్దరి వంక చూశాను.

బల్లమీద కూర్చున్న ఆమె, "నా పేరు సీత. చెన్నూరులో మిడ్‌వయిఫ్‌గా పనిచేస్తున్నాను. వీరి పేరు వీరాబాయి. మా బ్లాక్ ఎస్.ఇ.ఒ." అంటూ మడత కుర్చీలో కూర్చున్న ఆమెను చూపించింది. నమస్కార, ప్రతిసమస్కారాలు అయ్యాక "కూర్చోండి" అంది వీరాబాయి. బల్లకు ఈ చివర కూర్చున్నాను. బల్ల సరిగా లేదు. మధ్యలో ఎత్తుగా ఉండి కదులుతోంది. సాయంత్రం ఆరు కావస్తోంది. చీకటి పడుతోంది.

"నరసయ్యగారు లేరా?" అడిగాను.

"ఇప్పుడే రెడ్డిగారి దగ్గిరకు వెళ్లారు. వెంటనే వచ్చేస్తాననన్నారు" అంది వీరాబాయి.

"ఎన్ని గంటలకు వచ్చారు?"

"రెండు దాటింది."

"మంచి ఎండలో వచ్చారు. పవుల్ట్రీ ఇన్‌స్పెక్షన్ పూర్తి అయిందా?"

వీరాబాయి తలూపింది.

"పోయిన సంవత్సరం మేమిద్దరం బంజర వచ్చినప్పుడు మీరు ఇక్కడలేరు. మునుపు ఎక్కడ పనిచేశారు.?"

"ఎక్కడా పనిచేయలేదు. ట్రయినింగ్ అయిన తరువాత చినకోరుకొండిలోనే నా మొదటి అపాయింట్‌మెంట్. మీ కోసంగతి చెప్దామని వచ్చాను."

"చెప్పండి" అంది వీరాబాయి.

"ఈ రాత్రికి మీరు ఇక్కడే ఉంటున్నారు కదా?"

"అవును."

"ఈ రాత్రి మీరిద్దరు మా హాస్టల్‌లో భోజనానికి రావాలి, అని ఆహ్వానించటానికి వచ్చాను."

"హరిజన హాస్టల్‌లోనా?" అడిగింది సీత.

"అవును."

"హాస్టల్‌కు మీరు వార్డనా?"

"కాదు. కృష్ణారెడ్డి అనే తెలుగు మాస్టారు ఈ హాస్టల్‌కు వార్డన్. అతను చినకోరుకొండిలోనే ఉంటాడు. నేను హాస్టల్‌లోనే ఉంటున్నాను."

"మీకు పెళ్లి కాలేదా?"

"లేదు. మీకు అభ్యతరం లేకపోతే మీకు మా హాస్టల్‌లోనే పడుకోటానికి ఏర్పాటు చేస్తాను."

"మాకేం అభ్యంతరం లేదు. మీకు శ్రమ ఇస్తున్నానేమో అనిపిస్తోంది."

"ఇందులో శ్రమ ఏమీలేదు" అని అరుగు దిగి తిరిగి హాస్టల్‌కు వచ్చాను. బంజరలోగాని చినకోరుకొండిలోగాని భోజన హోటల్‌లు లేవు. బంజర చినకోరుకొండికి మైలు దూరంలో ఉంది. మంచి రోడ్డు లేదు. చెన్నూరు వి.డి.ఓ కార్యాలయం నుండి ఉద్యోగులు ఎవరైనా విజిట్‌కో, ఇనస్పెక్షన్‌కో రావాలంటే అంతదూరం నడుచుకుంటూ రావల్సిందే. లేదూ ఎద్దుల బండిమీద రావచ్చు. వర్షాకాలంలో మరీ ఇబ్బందిగా ఉంటుందని విన్నాను. ఈ రెండు గ్రామాలూ ద్వీపాల్లా అయిపోతాయట. నీరు తగ్గేవరకు ఉత్తరాలు రావు. ఉత్తరాలు పోవు. దినపత్రికా అంతే. అన్ని పనులు ఆగిపోతాయి.

వీరాబాయి, సీత భోజనాలు ముగిసేసరికి రాత్రి తొమ్మిది దాటింది. పిల్లలు వరండాలో కూర్చుని చదువుకుంటున్నారు. రాత్రి పదింటి వరకు చదువుకుంటారు. వాళ్లు ఉన్నారనేమో మరింత శ్రద్ధగా చదువుకుంటున్నారు. హాస్టల్ చుట్టూ నిండు వెన్నెల చక్కగా పరుచుకుని ఉంది. వీరాబాయి వరండాలో ఉన్న మంచం మీద కూర్చుని ఉంది. సీత తలుపు దగ్గరున్న స్టూలు మీద కూర్చుంది. నేను కుర్చీలో కూర్చున్నాను."

"మీ హాస్టల్‌లో ఎంత మంది ఉంటున్నారు." అడిగింది వీరాబాయి.

చెప్పాను.

"మేనేజరు ఎవరు?"

"ఏసురత్నం అని ఊటుకూరులో ఉంటున్నారు."

"మీ హాస్టల్‌లో పిల్లలు చాలా బుద్ధిమంతుల్లా కనిపిస్తున్నారు" అంది సీత.

తలూపి, "మా వాళ్లు అన్నిట్లోనూ మొదట ఉంటారు" అన్నాను.

"వెరీగుడ్. ఆటల్లో?."

"ఆ."

"పాటల్లో?"

"ఆహా."

"ఎవరినయినా పాట, మంచిది, పాడమనండి. వినాలని ఉంది. పిల్లలు చదువుకోవటం మాని మావంకే చూస్తున్నారు. 'ఆహా' అన్నాను కాని నిజమో కాదో తెలియదు. పాటలు ఎవరు బాగా పాడగలరో నాకు తెలియదు. వాళ్ల పనులు చేసుకుంటూ కూనిరాగాలు తీయటం విన్నాను. శేషయ్య అనే కుర్రాడు పద్యాల్ని చక్కగా పాడతాడని విన్నాను. అతను లేడు. వాళ్లూరు వెళ్లాడు. పిల్లల వంక చూశాను. అందరి ముఖాల్లో నవ్వు కనిపిస్తోంది. ఉత్సాహంగా ఉన్నారు.

"మా వాళ్లు ఊరకనే పాడరు" నెమ్మదిగా అన్నాను.

"పాడటానికి లంచం తీసుకుంటారా?" అడిగింది సీత.

"అవును" అని నవ్వాను.

"ప్చ్...ప్చ్.. నో యూజ్.....లంచాలు తీసుకోవటం ఇప్పటినుండే మీరు పిల్లలకు నూరి పోస్తున్నారా?"

"అదేంకాదు. లంచం డబ్బు రూపేణా ఉండనవసరంలేదు. ఇక్కడ లంచం అంటే, మీ ఇద్దరిలో ఎవరయినా, లేదూ ఇద్దరూ కలిసి మంచి పాట పాడితే మా పిల్లలు ఒక్క పాటకాదు. మీరు కోరినన్ని పాటలు పాడ్తారు. కదంర్రా?"

"ఆ" అన్నారు ఏక కంఠంతో.

వరండాలో కొత్త గాలి ప్రవేశించినట్టుంది.

"మేం పాడితే కాని మీ వాళ్లు పాడరు."

"అంతే."

"నాకు పాటలురావు. ఉత్తి బాత్‌రూం సింగర్‌ను."

"వీరాబాయి గారూ, మీరో?"

"డిటో."

సీత పకపకమని నవ్వి, "మీ బాధ నాకు అర్థం అయింది. మీ వాళ్లకు ఎవరికీ పాటలు పాడటం రాదు. ఈ నిజం మీరు ఒప్పుకోండి. మేం ఏమీ అనుకోం. ఏమంటారు వీరాబాయి గారూ" అంది.

అవునన్నట్టు వీరాబాయి నవ్వుతూ తలూపింది.

తల అడ్డంగా ఆడిస్తూ సీత వంక చూశాను. సీత పెదాలు ఎర్రగా నవ్వుతున్నాయి. నవ్వుతున్నప్పుడు బుగ్గలు సొట్టపడి మరింత చక్కగా ఉన్నట్టు అనిపిస్తోంది. సీత వీరాబాయి కన్నా బావుంది. సిగరెట్ వెలిగించి పిల్లల వంక చూశాను. నేనేం జవాబు చెప్తానో అని అందరూ నా వైపే చూస్తున్నారు. మీలో బాగా ఎవరు పాడతార్రా అని అప్పుడు పిల్లల్ని అడగటం బావుండదు. చిన్నగా దగ్గి, "అదేం కాదు. మావాళ్లు చక్కగా పాడ్తారు" అన్నాను.

"అయితే ఆలస్యం ఎందుకట, పాడించండి" అంది సీత. వరండా చివర్లో కూర్చున్న భట్రాజు లేచి నిలబడి చేతులు కట్టుకుని, "సారండీ, నేను పాడతానండీ" అన్నాడు.

తేలికగా గాలి పీల్చుకుని, "పాడు" అన్నాను.

భట్రాజు గొంతు సవరించుకుని పాట పాడటం మొదలుపెట్టాడు. మనోరమ సినిమాలో తలాత్ మహ్మముద్ పాడిన పాట అనుకుంటాను, "అందాల సీమా సుధానిలయం, ఈ లోకమే దివ్యప్రేమమయం" పాడుతుంటే పరవశించిపోయాను. చదువులో ఎప్పుడూ చివర ఉండే భట్రాజు కంఠస్వరం అంత మధురంగా ఉంటుందని నేను ఊహించలేదు. ఆ పూట వాడు నాకు కొత్తగా అవుపించసాగాడు. పాట పాడటం ముగించగానే అప్పుడే అయిపోయిందా అనిపించింది. వరండా చప్పట్లతో మారుమోగింది.

"చాలా బాగా పాడాడు. అబ్బాయ్, నీ పేరేమిటి బాబూ?" అడిగింది సీత.

"భట్రాజండీ."

"ఇంకో పాట పాడయ్యా."

"మీరు పాడండి" అన్నాడు భట్రాజు.

"అవును. ఈ సారి వంతు మీది. మీరు పాడాలి. తప్పదు." అన్నాను.

"నేను ముందే చెప్పాను కదా, నాకు పాటలు రావని."

"అదేంకాదు. మీరు పాడాల్సిందే" అన్నాడో కుర్రాడు.

"ఆ" అన్నారంతా.

"సైలెన్స్" అన్నాను.

గాజుల శబ్దం మినహా వరండా నిశ్శబ్దంగా ఉంది.

చివరంటా కాల్చిన సిగరెట్‌ను దూరంగా విసిరేశాను.

సీత తలవంచుకుని కాలిబోటన వేలితో నాపరాయి మీద రాస్తూ "మనసున మల్లెలూగెనే" పాట పాడటం మొదలెట్టింది. పాటకు సొంపుదనం కలవటంలేదు. మంచి కంఠస్వరమే కాని మాటలు వత్తిపలుకుతోంది. సగంపాట పాడిన తర్వాత పిల్లల్లో ఎవరో

కిసుక్కుమని నవ్వారు. దాంతో అందరూ నవ్వేసరికి సీత పాట ఆపేసింది. ఆ తర్వాత నేనెంత బతిమిలాడినా పాట కొనసాగించలేదు.

పదిన్నర వరకు పాటలతో, పద్యాలతో, కబుర్లతో సమయం తెలియకుండా గడిచిపోయింది. అంత సంతోషంగా గడుపుతామని నేను అనుకోలేదు. దీపాలు ఆర్పి అందరూ పడకల మీద చేరిన తర్వాత బయటకు వచ్చి బావి పక్కన ఉన్న బండమీద కూర్చున్నాను. రాత్రుళ్లు కొద్దిసేపు అక్కడ కూర్చోవటం నాకు ఇష్టం. మామిడితోట మీంచి గాలి విసురుగా వీస్తోంది. సిగరెట్ వెలిగించి వెన్నెల చల్లదనంలో తడుస్తున్నాను. నిద్ర పట్టటానికి సమయం ఉంది.

కొద్దిసేపయ్యాక ఎండిపోయిన ఆకులమీద ఎవరో నడుస్తున్న శబ్దం వినిపించగానే శబ్దం వచ్చిన వైపు చూశాను. వీరాబాయి నేను కూర్చున్న చోటుకు వస్తున్నట్లు అనిపించింది. ఆ సమయంలో అటు ఎందుకొస్తుందో నాకు అర్థం కాలేదు. దగ్గిరకు వచ్చాక గాని గుర్తుపట్టలేదు. ఆమె వీరాబాయి కాదు. సీత. తెల్లటి చీరలో దేవతలా నేను కూర్చున్న చోటుకు వచ్చింది. ఏమిటిలా వస్తున్నారని అని నేను అడిగే లోపల, "ఏమిటి ఇక్కడ కూర్చున్నారు?" అడిగింది.

"ఏం తోచనప్పుడు వచ్చి ఇలా కూర్చుంటాను." .

"నేను వచ్చి మిమ్మల్నేమీ డిస్టర్బ్ చేయటం లేదుకదా?"

"లేదు. మీరు రావటం నాకు సంతోషంగా ఉంది."

"ఎందుకనో ?"

నవ్వి, "నిజంగా నాకే తెలియటంలేదు." అన్నాను.

"వెన్నెల బాగుందికదూ?"

"చెన్నూరు నుండి వస్తూ మీరు తెచ్చారేమో అనిపిస్తోంది."

పకపకానవ్వి ఏదో అనబోయింది, కాని అనలేదు. చేతులు కట్టుకుని తలపైకెత్తి అరనిమిషం పాటు పరుగెడుతున్న మేఘాల వంక చూసి దీర్ఘంగా నిట్టూర్పు విడిచి నా ముఖంలోకి చూసింది.

"మీకు నిద్ర పట్టటం లేదా?" అడిగాను.

"ఊహు" అని తల అడ్డంగా ఆడించింది. అలా అంటున్నప్పుడు వెన్నెల వెలుగుకు ఆమె చెవులకున్న దుద్దులు మెరిశాయి.

"కొత్త ప్రదేశమని....." అంటుంటే నా మాటలకు అడ్డు తగిలి, "అదేం కాదు. మీరిచ్చిన మంచంలో నల్లులున్నాయి. కావాలనే ఇచ్చి ఉంటారు" అంది.

కూర్చోమని అందామనుకున్నాను అనలేక పోయాను.

"మీరెందుకు నిద్రపోలేదు?" అడిగింది.

"కొద్దిగా ఆలస్యంగా నిద్రపోతుంటాను."

ఏదో గుర్తు వచ్చినట్లు చేతి గడియారం వంక చూసుకొని, "గుడ్‌నైట్" అని తిరిగి నేను చెప్పే లోపల ఎండిపోయిన ఆకుల మీంచి నడుచుకుంటూ హాస్టల్‌వైపు వెళ్లిపోయింది. ఇంకొద్దిసేపు ఉండుంటే బావుండేది అనిపించింది. ఎందుకలా అనిపించిందో నాకు తెలియదు.

మరుసటి రోజు ఉదయం నేను స్కూలుకు బయల్దేరే సమయానికి వీరాబాయి, సీత చెన్నూరు ప్రయాణమవ్వసాగారు. వాళ్లు వెళ్లిపోయిన పది రోజుల వరకు ప్రతిరోజు నాకు గుర్తువచ్చేవారు. తర్వాత వాళ్ల సంగతి దాదాపు మర్చిపోయాను.

రెండు నెలలు గడిచాక నా సహోద్యోగి వెంకట్రామయ్య పెద్దకోరుకొండి నుండి ఏదో పనిమీద బంజరు వచ్చి నన్ను వాళ్ల ఊరు తీసుకెళ్లాడు. ఒకరోజంతా వాళ్ల ఇంట్లో గడిపాను. ఆ మరుసటి రోజు ఆదివారం భోజనాలు ముగించుకొని నేనూ, వెంకట్రామయ్య సైకిళ్లు వేసుకొని అతని తోటలను చూసేందుకు బయలుదేరాం. రెండు మూడు గంటలపాటు తోటల్లో గడిపాక తర్వాత ఏం చేయాలో తోచలేదు.

"చెన్నూరు వెళ్దాంపద" అన్నాడు వెంకట్రామయ్య.

వీరాబాయి, సీత గుర్తు వచ్చారు.

"ఇక్కడకెంతదూరం ఉంటుంది?" అడిగాను.

చెప్పి, "చీకటి పడే లోపల తిరిగి వచ్చేయగలం" అన్నాడు.

సైకిలు మీద చెన్నూరు బయల్దేరాం. ఎండ పలచబడింది. మట్టిదారి గతుకులుగా ఉంది. ఆ దారి మీద సైకిలు నడపటం నాకు ఇబ్బందిగానే ఉంది. మామూలుగా అయితే కాదనే వాడినేమో కాని నాకు వీరాబాయిని, సీతను చూడాలని, వారితో కొద్దిసేపు మాట్లాడాలని ఉంది.

"నీకు చెన్నూరు బాగా తెలుసా?" అడిగాను.

"తెలుసు. మా చెల్లెల్ని చెన్నూరు ఇచ్చాం. ఊరు నాకు కొత్తేం కాదు."

"వీరాబాయి తెలుసా?"

"ఎస్.ఇ.ఓ.కదూ?"

తలూపాను.

"పెద్ద పరిచయం లేదుకాని తెలుసు. ప్రస్తుతం వీరాబాయి చెన్నూరులో లేదు. రెండు వారాల కిందట బదిలీ అయి ఖమ్మం అవతల ఏదో బ్లాకుకు వెళ్లిపోయింది. నీకు ఆమె ఎలా తెలుసు?"

"వీరాబాయి, సీత ఒకసారి బంజర వచ్చారు."

"సీత కూడానా?"

"ఆ."

అతను గమ్మత్తుగా ఈల వేశాడు. ఆ ఈల వేసిన పద్ధతిలో సీతంటే అతనికి మంచి అభిప్రాయం ఉన్నట్టనిపించలేదు. కొద్దిసేపు మౌనంగా ఉండి అతనే అన్నాడు, "సీత వాళ్లది కొత్తగూడెం దగ్గిర చిన్న పల్లెటూరు, పాపం, వాళ్లింట్లోవాళ్లు సీత పెళ్లి గురించి పట్టించుకోరు. విసిగిపోయిందనుకుంటాను. ఎవర్నో ఒకర్ని కట్టుకుని సెటిలయి పోదామని తాపత్రయ పడుతోంది. లోగడ ఇద్దరు పెళ్లి చేసుకుంటామని వచ్చి ఆమెతో ఉండి పెళ్లి చేసుకోకుండా మోసం చేసి ఉడాయించారు...... ఇప్పటికీ పెళ్లి భ్రమలో ఉందో లేదో తెలియదు."

సీత మీద జాలి వేసింది.

నలభయి నిమిషాల తరువాత చెన్నూరు చేరుకుని సరాసరి వెంకట్రామయ్య చెల్లెలింటికి వెళ్లాం. ఆదివారం అవటాన అతని బావ పీకవరకు తాగి అప్పుడే పడుకున్నట్టున్నాడు. కొద్దిసేపు కూర్చుని వచ్చేస్తుంటే అతని చెల్లెలు సాయంత్రం వరకు ఉండి భోజనం చేసి వెళ్లమంటుంటే "ఈసారి వచ్చినప్పుడు తింటాం" అని బయటికి వచ్చాడు. నేనతన్ని అనుసరించాను.

సైకిలెక్కి పెద్దకోరుకొండి రోడ్డు పట్టాం అరఫర్లాంగు వెళ్లాక సైకిలాపి, "సీతను చూడదలుచుకోలేదా?" అడిగాడు. నాకు సీతను చూడాలని ఉంది. నా అంతట నేను ఆ మాటను అతనికి నా మొహమాటం వలన చెప్పలేక పోయాను. వెంటనే బయట పడకుండా, "ఎందుకు లెద్దూ?" అన్నాను.

"ఇంతదూరం వచ్చి సీతను చూడకుండా వెళ్లిపోతే ఎలా?"

అయిదు నిమిషాల తరువాత వెంకట్రామయ్య సైకిలును ఒక తాటాకుల ఇంటి ముందు ఆపి బెల్ మోగించాడు. తలుపు తెరుచుకొని సీత బయటికివచ్చి మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయింది.

"రండి, రండి" సంతోషంగా మమ్మల్ని ఆహ్వానించింది. సైకిలు బయట పెట్టి లోపలికి నడిచాం. గచ్చునేల మీద ముగ్గు మోడరన్ ఆర్ట్‌లా ఉంది. ఇల్లు చిన్నదయినా శుభ్రంగా ఉంది. కొత్త దుప్పటి మంచం మీద వేసి, "కూర్చోండి" అంది. కూర్చున్నాక, "మీరెలా ఉన్నారు?" అడిగింది. నా రాకతోనో ఏమో ఆమె కళ్లు మెరుస్తున్నాయి. అన్ని రోజుల తరువాత ఆమెను చూడటం నాకూ ఆనందంగా ఉంది. "బావున్నాను. మీరో?" అడిగాను. "అలా అలా", కుడిచేతిని గాలిలో అలలుగా ఆడిస్తూ బుగ్గలు సొట్టలు పడేలా నవ్వింది. మునుపటి కన్నా కొద్దిగా లావయింది.

"ఇతను...... " అంటూ వెంకట్రామయ్యను పరిచయం చెయ్యబోతుంటే "నాకు తెలుసు. మీరు శివకామయ్య బావగారు కదూ?" అడిగింది అతన్ని. అతను నవ్వి తలూపాడు. "మీ చెల్లెలు నాకు తెలుసు. మిమ్మల్ని చూశాను కాని ఇదే పరిచయం......" అంది.

పక్కింటి కుర్రాడిని పిలిచి పకోడి, టీలు తెప్పించింది. తీసుకున్నాక గంటసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాక లేచి, "మేమిక వెళ్తాం" అన్నాను. అతను కూడా నాతోపాటు లేచి నిలబడ్డాడు.

"అప్పుడే?" అడిగింది.

"ఇప్పటికే చాలాసేపు కూర్చున్నాం."

"ఈ రాత్రికి ఇక్కడే ఉండండి. రేపు ఉదయాన్నే వెళ్లిపోదురుగాని" అంది నాతో.

"రేపు ఉదయాన్నే స్కూలుకు వెళ్లాలి."

"సైకిలుందిగా. రెండు గంటల్లో మీ ఊరు వెళ్లి స్కూలుకి అందుకోగలరు. ఈ రాత్రికి మీరు మా ఇంట్లో తప్పకుండా భోజనం చేసి వెళ్లాలి."

ఉండి భోజనం చేద్దామని ఉంది. బయటపడటం బాగుండదనిపిస్తోంది. "బదులు తీర్చుకుంటున్నారా?" నవ్వుతూ అడిగాను.

"అలానే అనుకోండి."

"నువ్వుండు. నేను వెళ్తాను." అన్నాడు వెంకట్రామయ్య.

మాట వరసకైనా అతన్ని ఉండమనలేదు. భోజనం చేసి వెళ్లమని అనలేదు. అతను వెళ్లిపోవటం నాకు రుచించలేదు. "నేనూ వస్తాను" అన్నాను అతనితో .

"నువ్వుండి నింపాదిగా రేపు ఉదయాన్నే బయల్దేరి రా" అని బయటికి వెళ్తుంటే నేనూ అతని కూడా వెళ్లాను. సైకిలు తీసుకుంటుంటే "మాట" అన్నాను. హర్ట్ అయినట్టు లేదు. నవ్వి నా కళ్లలోకి సూటిగా చూసి కనుగీటి సైకిలెక్కి వెళ్లిపోయాడు.

ఇంట్లోకి వచ్చాను. అప్పటి వరకు మా మాటలతో సందడిగా ఉన్న ఇల్లు గమ్మునయింది. సాయంకాల లోపు ఎండ గదిలోకి పొడుగ్గా పడుతోంది. మంచంమీద కూరున్నాను. స్టూలు మంచం దగ్గిరగా లాక్కుని కూర్చుంది సీత. చీర కొంగు భుజాల నిండా కప్పుకుని, "నేనంటే మీకు భయమా?" నవ్వుతూ అడిగింది.

"లేదు."

"ఎందుకో నాకలా అనిపించింది."

తల అడ్డంగా ఆడించాను.

"అతనితోపాటు మీరు వెళ్లిపోదామని అనుకోలేదూ?"

"అనుకున్న మాట నిజం. మీకు శ్రమ కలిగించటం ఎందుకు?."

"ఇందులో నాకు మీరు ఎటువంటి శ్రమ కలిగించటంలేదు. మీరొచ్చినందుకు నాకెంత సంతోషంగా ఉందో తెలుసా?" అని నవ్వింది. ఆ నవ్వు సమ్మోహనంగా ఉంది.

రాత్రి భోజనాలు ముగించేసరికి తొమ్మిదయింది. మంచంమీద నేను కూర్చుంటే తను స్టూలు మీద మంచం దగ్గర కూర్చుని చెన్నూరు కబుర్లు కొత్తగూడెం విశేషాలు వాళ్ల ఆఫీసు రాజకీయాలు చెప్తుంటే నిద్రను పక్కకు నెట్టేస్తూ శ్రద్ధగా విన్నాను. "మీ మాటలు బాగుంటాయి. ఎంతసేపయినా వినాలనిపిస్తుంది." అన్నాను. అంటూంటే నా కుడిచేయిమీద తన చేయివేసి నిమిరింది. హాయిగా ఉన్నట్టనిపిస్తుండగా తన చేయి తీసేసుకుని వంట గదిలోకి వెళ్లిపోయింది.

మంచంమీద అలా ఒరిగానో లేదో అన్ని మైళ్లు ఎండలో సైకిలు తొక్కటం వలన, చాలా రోజుల తరువాత కడుపునిండా రుచికరమైన భోజనం చేయటం వలన నిద్రకు ఆగలేకపోయాను. సీత నన్ను తట్టి లేపుతుంటే మెలకువ వచ్చింది. లేచి కూర్చున్నాను. గదిలో హరికేన్ లాంతరు వెలుగుతోంది. చేతి గడియారం వంక చూశాను. పదకొండూ నలభయి అయింది. సీత మంచం మీద నాకు ఆనుకుని కూర్చుంది. రవిక లేదు. నిద్రమత్తు ఒక్కసారిగా వదిలింది.

"నిద్రపోయేందుకా మిమ్మల్ని ఇక్కడ ఈ రాత్రికి ఉండమన్నది?" గోముగా అంది. ఒకపక్క భయం. మరోపక్క కోరికతో నా గుండె వేగంగా కొట్టుకోవటం మొదలెట్టింది. నాకు మరింత దగ్గరగా కూర్చుంటూ, "నా ప్రశ్నకు జవాబు చెప్పరేం?" అడిగింది నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ. ఆమె చేతిలోని మందోష్ణానికి మనసు బిగుసుకుపోతోంది. నా చేయిని తన ఛాతిమీదకు తీసుకుని అదిమి పట్టుకుంది పట్టుతప్పుతున్నాను."నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" నా చెవి కొరుకుతూ అంది. ఆమె పెదాలు వేడిగా ఉన్నాయి. "మీరేమీ మాట్లాడటంలేదు" అని మళ్లీ మళ్లీ ముద్దులు పెట్టుకుంది. మాట్లాడే స్థితిలో నేను లేను.

సీత ముందుకు వంగి నా మెడచుట్టూ చేతులు వేసి తన వైపుకు అదుముకుంటూ హఠాత్తుగా నన్ను వదిలి మంచం దిగి గోడపక్క ఉన్న స్టూలు మీద కూర్చుని బల్ల మీద ఉన్న రవిక అందుకుని చింపటం మొదలుపెట్టింది. తనెందుకలా ప్రవర్తిస్తుందో నాకు అర్థం కాలేదు. మంచం దిగి నిలబడ్డాను. ఏమి చేయాలో తోచటం లేదు. చుట్టు పక్కల ఇళ్లలో వాళ్లకు వినబడేలా "వదలండి...... వదలండి" అని పెద్దగా అరిచింది.

నా గుండెలో రాయి పడింది. కాళ్లు నేలకేసి కొడుతూ "నన్నేమని అనుకున్నావు, ఎటువంటి దాన్ని అనుకున్నావు?" గట్టిగానే అడుగుతోంది నన్ను.

నేనే పరిస్థితిలో ఉన్నానో కొంచెంకొంచెంగా అర్థమవుతోంది. సీత అతి నేర్పుగా నన్ను పద్మవ్యూహంలోకి లాగుతోంది. వెళ్లానంటే బయటికి రావటం నావలన కాదు. సీత అలాగే మరో అయిదు నిమిషాలపాటు అరిస్తే చుట్టుపక్కల వాళ్లు మేల్కొని సీత ఇంటికి తప్పకుండా వస్తారు. వీధి తలుపు బార్ల తెరిచిఉంది. అది నా ఊరుకాదు. సీత మాట వింటారు గాని, నా మాట వినటానికి ప్రయత్నం కూడా చేయరు. గొంతు మరింత పెద్దది చేసి "నువ్వింత గాలి వాడివని తెలిసిఉంటే నా ఇంట్లోకి అడుగుపెట్టనిచ్చే దాన్ని కాదు. ఎంత చదువుకున్నా గాలి మనుషులకు గాలి బుద్ధులు ఎక్కడికిపోతాయి.? ఛీ.....ఛీ......"నేల మీద ఉమ్ముతూ శాపనార్థాలు పెడుతోంది.

నాకు ముచ్చెమటలు పోస్తున్నాయి. ఇటువంటి సంఘటన నాకు ఎదురవుతుందని నేను అనుకోలేదు. పర్యావసానం ఎలా ఉంటుందో అనూహ్యంగా ఉంది. పరిస్థితి రభస చేసిగాని సీత ఊరుకునేటట్టు లేదు. కాళ్లు వణుకుతున్నాయి. మనసు పనిచేయటంలేదు. నా గుడ్డలు అందుకుని తొడుక్కున్నాను. అంత రాత్రప్పుడు పెద్దకోరుకొండి ఎలా వెళ్లటం? ఓట్రించే స్త్రీలతో ఎలా మాట్లాడాలో నాకు తెలియదు. గుండె భయంతో నిండి పొర్లుతోంది.

"అంత కోరికగా ఉంటే పెళ్లి చేసుకోవచ్చుగా..... పెళ్లి మట్టుకు వద్దు గాని వళ్లు కావాలి..... మనిషికి సిగ్గు, శరమూ ఉండాలి...." సీత మాటలు ఆగటం లేదు.

నా పెదాలు విపరీతంగా వణుకుతున్నాయి. రెండు చేతులు జోడించినా ఆగలేదు. "కలేజా ఉంటే పెళ్లి చేసుకుని చూపించు......" అంది.

అరిచి అరిచి అలసిపోయిందో, నా నమస్కారం చూసి నెమ్మదించిందో తెలియదు. మనిషిలో ఆవేశం తగ్గింది.

నా గొంతులోంచి మాటలు పెగలి రావటంలేదు. భయం వలన పూడుకుపోయినట్టుగా ఉంది. ధైర్యం పుంజుకుని, "నేను పెళ్లి చేసుకోలేను..... మిమ్మల్లే కాదు..... ఎవరినీ చేసుకోలేను..... నాకు పెళ్లి చేసుకునే అదృష్టం లేదు." అన్నాను. ఎలా అన్నానో, అనగలిగానో నాకు గుర్తు లేదు. ఆమె కళ్లల్లోకి సూటిగా చూస్తూనే అన్నాను. నా కళ్లల్లో నీళ్లు ఒక్కటే తక్కువ.

వెంటనే ఏదో అనబోయింది కాని అనలేదు. పాలపొంగుమీద నీరు పడినట్లు చల్లబడింది. నా మాటలు నమ్మలేనట్టు తల అడ్డంగా ఆడించింది.

"నేను మీతో అబద్ధం చెప్పటం లేదు. నాలుగు సంవత్సరాల కిందట ఒక ప్రమాదంలో దెబ్బ తగిలింది. నేను సాంసారిక జీవితానికి పనికిరాను." నెమ్మదిగా అన్నాను.

నా మాటల మీద ఆమెకు నమ్మకం కుదరటంలేదు అనుకుంటాను, మూడు నాలుగు నిమిషాలపాటు నా కళ్లలోకి చూసి ఏమనుకుందో ఏమో చివరకు దీర్ఘంగా నిట్టూర్చింది. పల్లెత్తి నన్ను మరో మాట అనలేదు. పావుగంటపాటు నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది. తర్వాత లేచి తలుపు గడియ వేయబోతుంటే,

"నేను వెళ్తాను" అన్నాను.

"ఇంత రాత్రా?"

తలూపాను.

"వద్దు ఇంతరాత్రప్పుడు వద్దు.రేపు ఉదయాన్నే వెళ్లండి" అంది.

తలుపు మూసి గడియపెట్టి లైటు వత్తి తగ్గించి నేల మీద చాప పరుచుకుని పడుకుంది. కొద్దిసేపయిన తర్వాత ఆమె  చిన్నగా ఏడుస్తున్నట్లు వినిపించింది.

* * *

నాకు ఈ కథ రంగారావు చెప్పి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తోంది. రంగారావు గుర్తు వచ్చినప్పుడల్లా నాకు వెంటనే సీత గుర్తు వస్తుంది. సీతకు ఇప్పటికైనా పెళ్లి అయ్యిందోకాలేదో నాకు తెలియదు. ఈ కథ మీద నా అనుమానాలు నాకు ఇప్పటికీ ఉన్నాయి. అందులో ఒకటి: రంగారావు నాణానికి ఇవతలి వైపే చూపించాడు. అవతలి వైపు నిజం ఎంతో ఉండాలి. రెండు: రంగారావు అబద్ధాలు ఆడదని కాదు. సీత అలా ప్రవర్తించి ఉండదు. మూడు: రెండు సంవత్సరాల కిందట రంగారావు తన మేనమామ కూతుర్ని పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడతనికో పాప. ఆ పాప పేరు సీత.

◆ భారతి, మాస పత్రిక అక్టోబరు, 1971